సాక్షి
జోగులాంబ గద్వాల

శనివారం, 1, మార్చి, 2025



బీసీ కులగణన సర్వే

బీసీ కులగణన సర్వే తప్పుల తడకలా ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు.

వివరాలు 8లో ▸



.. ఉక్కుపాదం

దుందుభీ వాగులో ఇసుక మాఫియాపై అధికారులు ఉక్కుపాదం మోపారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.7 /16.2

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు



గద్వాల క్రైం: ఫిట్‌నెస్ లేని ప్రైవేటు స్కూల్ బస్సులలో విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్తే చట్టపరమైన చర్యలు తప్పవని గద్వాల ఎంవీఐ రాములు నాయక్ అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని జమ్మిచెడ్ రోడ్డు మార్గంలో స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పలు స్కూల్ బస్సులు ఫిట్‌నెస్, పర్మిట్, సామర్థ్యం తదితర అనుమతులు లేకుండా విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తున్నట్లు అధికారులు గుర్తించారు. సామర్థ్యం లేని రెండు ప్రైవేటు స్కూల్ బస్సులను సీజ్ చేశారు. రోడ్డు భద్రతా నిబంధనలు, పలు అనుమతి పత్రాలు లేకుండా నడుస్తున్న బస్సులకు జారిమానాలు విధించారు. గోవర్ధన్, గోవిందు, ఖాద్దర్ పాల్గొన్నారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి

అలంపూర్: జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేద్దామని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మిథున్ తేజ అన్నారు. అలంపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో పోలీస్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ మిథున్ తేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ఈ నెల 8వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లక్ష్యాలు, ఉద్దేశాలను వారికి వివరించారు. పోలీసులు న్యాయవాదులు సమన్వయంతో కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అధిక కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు. సమావేశంలో సురేష్ కుమార్, సీఐలు రవిబాబు, టాటబాబు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

ఎర్రవల్లి: సమగ్ర సస్యరక్షణతోనే రైతులు అధిక దిగుబడులు సాధించొచ్చని సీఐపీఎంసీ ఇన్‌చార్జ్ సునీత అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని సాతర్ల రైతు వేదికలో కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో పంటల సాగులో సమగ్ర సస్యరక్షణపై డీలర్లు, రైతులకు హెచ్‌ఆర్‌డీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఏఓ సక్రియనాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి అక్బర్‌తో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతులు ఎన్‌పీఎస్‌ఎస్ అనే మొబైల్ యాప్‌ను వినియోగించి వివిధ పంటలపై సులభంగా సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చునని సూచించారు. ప్రతి ఏడాది పంట మార్పిడి చేసుకోవాలని, పొలం చుట్టూ వలయంగా ఎర పంటలను వేసుకోవాలని, విత్తన శుద్ధి చేయాలని, అవసరం మేరకు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. అనంతరం మిరప పంట సందర్శించి లింగాకర్షక బుట్టల యొక్క ఆవష్యకతపై అవగాహన కల్పించారు.

ఎండలో మాడిపోవాల్సిందే

కానరాని బస్ షెల్టర్లు



గద్వాల రైల్వేస్టేషన్ క్రాస్‌రోడ్డు వద్ద బస్సుల కోసం రోడ్డు పక్కన నిరీక్షిస్తున్న ప్రయాణికులు



- బస్సుల కోసం ప్రయాణికుల పడరాని పాట్లు
- చెట్లు.. దుకాణాల నీడే దిక్కు
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

గద్వాలటౌన్: వేసవి రాకముందే ఎండలు మండుతున్నాయి.. రోడ్డుపైకి వెళ్తే కనీసం నిల్చునేందుకు కూడా నీడ కనిపించని దుస్థితి. ఇక ఆర్టీసీ బస్సుల కోసం వెళ్లే ప్రయాణికుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. ప్రయాణికుల కోసం కనీస సౌకర్యాల కల్పనలో ఆర్టీసీ అశ్రద్ధ వహిస్తుంది. ప్రధానంగా ప్రయాణికులకు అవసరమైన సంఖ్యలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, కూలి నాలి పని చేసుకునే వారు ఇలా ఒకరేంటి ప్రతి ఒక్కరు బస్సుల కోసం రోడ్లపైనే నిరీక్షించాలంటే నరకం కనిపిస్తోంది. నిల్వ నీడ లేక భానుడి ప్రతాపానికి మాడిపోతున్నారు. కొంత నీడ, కొన్ని ఇనుప బెంచీలుంటే ప్రయాణికులకు ఊరట లభిస్తుంది. అయితే ఆ కాస్త భాగ్యం కూడా లేదు. గంటల తరబడి రోడ్ల పక్కన నిల్చొని ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం నిత్యం ఎదురు చూడాల్సివస్తోంది.

ప్రయాణికులు పెరుగుతున్నా..

జిల్లా వ్యాప్తంగా బస్సు ప్రయాణికుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఆమేరకు షెల్టర్ల నిర్మాణం జరగడం లేదు. ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్లు నిర్మించడం ఆర్టీసీ విధి. అయితే ఆర్టీసీ చురుకుగా వ్యవహరించకపోవడం వల్ల షెల్టర్లకు కొరత ఏర్పడింది. జిల్లా కేంద్రంలో చాలాకాలం నుంచి షెల్టర్ల



గద్వాల రామనందతీర్థ చౌరస్తాలో ..

కోసం ప్రయాణికులు ఎదురు చూస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద కొన్ని ఏళ్ల క్రితం ఎల్ఐసీ నిర్వాహకులు, పీజేపీ క్యాంపు దగ్గర ఆ శాఖ ఉద్యోగులు స్వచ్ఛందంగా బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఊరట కల్పించారు. ఈ రెండు షెల్టర్లే పట్టణ మొత్తానికి దిక్కుగా మారాయి. అయిజ, అలంపూర్ చౌరస్తా, శాంతినగర్ పట్టణాలతో పాటు ఎర్రవల్లి చౌరస్తా, ధరూర్, మల్దకల్, బల్గేర తదితర ప్రాంతాలలో ప్రయాణికుల రద్దీ నిత్యం ఉంటుంది. వందలాది మంది బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. ఇంతటి కీలకమైన ఈ ప్రాంతాలలో బస్సుషెల్టర్లు నిర్మించలేకపోతున్నారు. ఇక్కడ ఎండలోనే ప్రయాణికులు నిరీక్షించక తప్పని పరిస్థితి. ఓవైపు బస్ షెల్టర్ లేక.. బస్సులు రాక.. గంటలకొద్దీ ప్రయాణికులు ఎండలోనే మాడిపోతూ చేసేది లేక ప్రైవేటు వాహనాల్లో వేలాడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఆర్టీసీకి వచ్చే ఆదాయం ప్రైవేటు వాహనాల జేబుల్లోకి వెళ్తోంది. అదే బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తే బస్సు కోసం వేచి ఉంటారు. ఫలితంగా ఆర్టీసీ ఆదాయం పెరుగుతోంది.

బస్ షెల్టర్లు నిర్మించండి



ప్రయాణికుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని గద్వాలలో బస్ షెల్టర్లు నిర్మించాలి. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో బస్ షెల్టర్లు కొరత వేధిస్తోంది. ఇవి లేకపోవడం వలన ఆరుబయట ఎండ, వానలో ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తోంది. మున్సిపల్, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో ముఖ్య కూడళ్లను గుర్తించి, బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి. – అనిల్‌కుమార్, గద్వాల

ప్రయాణికుల ఇబ్బందులు



బస్సు షెల్టర్లు లేకపోవడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు బస్సులు ఆలస్యం అయితే చాలాసేపు ఎండలోనే ఉండిపోయే పరిస్థితి ఉంది. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అనువైన చోట బస్సు షెల్టర్లను నిర్మించాలి. – వెంకటయ్య, గద్వాల

దాతల సహకారం కోరతాం



జిల్లా కేంద్రంతో పాటు పలు ముఖ్యమైన ప్రాంతాలలో బస్ షెల్టర్ల ఏర్పాటు ఆవశ్యకత ఉంది. ప్రయాణికుల వినతులను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులకు నివేదించాం. వీటి ఏర్పాటుపై గతంలోనే ప్రతిపాదనలు చేశారు. స్థానికంగా ఉన్న దాతల సహకారంతో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– మురళీకృష్ణ, ఆర్టీసీ డీఎం, గద్వాల

బస్సు షెల్టర్లు లేని ప్రాంతాలు

జిల్లా కేంద్రంలోని రథశాల ఎదురుగా, కళాశాలకు వెళ్లే రహదారి వద్ద, గంజి చౌరస్తా వద్ద నిత్యం ప్రయాణికులు వందల సంఖ్యలో ఉంటారు. వీటితోపాటు ఆస్పత్రి ఎదురుగా, డ్యాంకు వెళ్లే దారిలో ఉన్న సబ్‌స్టేషన్ దగ్గర బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షిస్తుంటారు. అంతేకాక రైల్వేస్టేషన్ క్రాస్‌రోడ్ దగ్గర ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. ప్రధాన రహదారి పొడువున ఉన్న గ్రామాల స్టేజీల దగ్గర ప్రయాణికులు పడిగాపులు కాస్తుంటారు. అక్కడ ఎలాంటి నిర్మాణాలు, చెట్లు లేకపోవడంతో రోడ్డుపైనే నిల్చుని ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గద్వాల, అయిజ, అలంపూర్, శాంతినగర్‌లలో బస్సు షెల్టర్లు లేకపోవడం వలన సమీపంలో ఉన్న దుకాణాలు, హోటళ్ల వద్ద ప్రయాణికులు పడిగాపులు కాస్తుంటారు. జిల్లా నేపథ్యంలో ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పోలీస్‌శాఖ, ఆయా ప్రాంతాల్లోని స్థానిక సంస్థలు సంయుక్తంగా బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలి. బహుముఖంగా విస్తరిస్తోన్న జిల్లా కేంద్రంతో పాటు వాణిజ్య పరంగా వృద్ధి సాధిస్తున్న అయిజ, శాంతిగనర్, ఎర్రవల్లి చౌరస్తా ఆయా మండల కేంద్రాలలో ప్రయాణికుల అవస్థలను గుర్తించి అవసరమైన చోట బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకం రెండో దశ ప్రారంభమైనట్లు పథకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుడి వయసు 21–24మధ్య ఉండాలని, అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగి కుటుంబం ఉండరాదని, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తయి ఉండాలని తెలిపారు. అదేవిధంగా కుటుంబ సంవత్సర ఆదాయం రూ.8లక్షల లోపు ఉండాలని, ఎంపికైన విద్యార్థులకు నెలసరి జీతం రూ.5000లు ఇవ్వనున్నట్లు తెలిపారు. 12నెలల ఇంటర్న్‌షిప్ కాల వ్యవధిలో కనీసం 6 నెలల పాటు ఉద్యోగ శిక్షణ ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు pmintership.mcf.gov.in పోర్టల్‌లో మార్చి 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అడ్డంకులు దాటుతూ..



సొరంగంలో నీటిని పంపింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన మోటార్

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఏడోరోజు కొనసాగిన సహాయక చర్యలు
- ముమ్మరంగా బురద, మట్టి, శిథిలాల తరలింపు
- అత్యాధునిక పరికరాలతో గాలింపు

అచ్చంపేట: దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు చేపట్టిన సహాయకచర్యలు ముమ్మరం చేశారు. అత్యాధునిక పరికరాలతో గాలింపు చర్యలు చేపడుతున్నారు. గ్యాస్ కటింగ్ పరికరంతో టీబీఎం మిషన్ విడి భాగాలను కట్ చేసే పనులు వేగవంతమయ్యాయి. కటింగ్ చేసిన విడి భాగాలను ఎప్పటికప్పుడు బయటకు తీసుకొచ్చారు. శుక్రవారం ఏడోరోజు లోకో ట్రైన్ ద్వారా సింగిరేణి బొగ్గు గనుల నుంచి తెప్పించిన పెద్ద సైజు ట్రేలలో సొరంగం బయటికి బురద, గ్యాస్, ఫాస్మ కటర్ల ద్వారా టీబీఎం విడి భాగాలు, ఇతర ఇనుప రాడ్లు, పైపులను రెస్క్యూ టీం సభ్యులు మోయగలిగిన సైజులో కట్ చేసి బయటికి తీసుకొస్తున్నారు. అయితే ఇప్పటి వరకు కన్వేయర్ బెల్ట్‌ను పునరుద్ధరించలేదు. సొరంగం లోపల 14.85 కిలోమీటర్ల వద్ద టీబీఎం మిషన్ ఉండగా పైకప్పు కూలింది. ఇక్కడ పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు లోకో ట్రైన్‌ను 13.500 కిలోమీటరు వరకు తీసుకెళ్లేందుకు ప్రణాళిక బద్ధగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. గట్టి పడిన మట్టిని తీయడానికి మినీ జేసీబీలను వినియోగిస్తున్నారు. జేసీబీలు, బృందాలు లోపల బురదను పక్కకు తొలగిస్తూ బయటికి పంపిస్తున్నారు. మూడు బోగీలు (ట్రేలు) ద్వారా బురద బయటికి తరలించారు. సొరంగంలోకి చేరిన నీటిని బయటకు పంపింగ్ చేయడానికి అదనపు మోటార్లను తీసుకొచ్చారు. పూర్తిస్థాయిలో మట్టిని తరలించకపోయినా లోపల ఓ పక్కకు వేస్తూ కార్మికుల ఆచూకీ కనుకొనేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. బాధితుల కోసం సొరంగంలో టిషర్స్ అందుబాటులో ఉంచారు.

రక్షణ కోసం..

టన్నెల్‌లోకి వెళ్లే సహాయక బృందాల రక్షణ కోసం కృత్రిమ ఏర్పాట్లు చేస్తున్నారు. లోపల ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఐరన్ షీట్లు, పైపులను రౌండ్‌గా బెండ్ చేసి వెల్డింగ్ చేసిన తర్వాత లోపలికి తీసుకెళ్తున్నారు. దీని ద్వారా లోపలికి ప్రవేశించేలా చర్యలు చేపట్టారు. సొరంగం కూలిన, రాళ్లు, రప్పలు ఊడిపడినా ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేలా వీటిని తయారు చేసున్నారు. దీంతో ఏమైనా ప్రమాదం జరిగినా తప్పించుకునే అవకాశం ఉంటుందని సహాయక బృందాలు పేర్కొంటున్నాయి. పోలీసులు బందోబస్తు నిర్వహిస్తూ టన్నెల్ వద్దకు ఇతరులు వెళ్లకుండా నివారిస్తున్నారు.



సొరంగం స్కెచ్ వేస్తున్న బృందాల ప్రతినిధులు

సొంతూళ్లకు కార్మికులు..

టన్నెల్‌లో జరిగిన ప్రమాదంతో భయాందోళనకు గురైన కార్మికులు ఒక్కొక్కరుగా సొంతూళ్లకు వెళ్లిపోతున్నారు. కుటుంబసభ్యులు ఫోన్ చేసి తిరిగి రావాలని వేడుకుంటున్నారని, గత్యంతరం లేక మూడు నెలల జీతాలు రావాల్సి ఉన్నా వదిలి వెళ్తున్నామని కార్మికులు వాపోయారు. సొరంగం వద్ద పనులు సాగుతాయో లేదో అని.. తమ సొంత రాష్ట్రంలోనే ఏదో ఒక పని చేసుకుంటామని పేర్కొంటున్నారు. జీతాలు లేకున్నా సరే మా ప్రాణాలే ముఖ్యం అంటున్నారు.

- టన్నెల్ వద్ద కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, వివిధ శాఖల అధికారులు, విపత్తుల విభాగం ఉన్నతాధికారులు సహాయక చర్యలను పర్యవేక్షించారు.

అదనపు బృందాల రాక

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు శుక్రవారం రామగుండం, కొత్తగూడెం నుంచి అదనంగా సింగరేణి బృందాలు చేరుకున్నాయి. సింగరేణి కార్మికులు ఎక్కువగా కష్టపడుతూ సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు సింగరేణి కార్మికులు సొరంగంలో బురద మట్టిని తొలగించడానికి శాయశక్తులా పనిచేశారు. సింగరేణి కార్మికులు విడతల వారీగా సొరంగంలోకి వెళ్లి పనులు చేపడుతున్నారు. వీరితో పాటు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, హైడ్రా, ఆర్మీ, నేవీ, ర్యాట్ హోల్ మైనర్స్, బీఆర్‌ఓ, రైల్వే శాఖతో పాటు పలు ప్రైవేట్ నిర్మాణ సంస్థలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి.

- అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం టన్నెల్‌లో 11.560 కి.మీ., నుంచి 12.950 కి.మీ., వరకు వాటర్, బురద పేరుకుపోగా.. రెండు రోజులుగా వీటిని తొలగిస్తున్నారు. అలాగే 150 మీటర్ల మేర పేరుకున్న మట్టి, బురద, రాళ్లు, సెగ్మెంట్, టీబీఎం శిథిలాలను తొలగించే చర్యలు ముమ్మరం చేశారు.

15 ఏళ్లుపై బడిన వెహికిల్స్‌తో తీవ్రమైన కాలుష్యం

- రోగాల విజృంభణ నేపథ్యంలో కట్టడికి చర్యలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 32,181 వాహనాలు
- గ్రీన్ ట్యాక్స్ భారీగా పెంచిన ప్రభుత్వాలు

కాలం చెల్లిన వాహనం.. కాలుష్య కారకం





మహబూబ్‌నగర్‌లో 15 ఏళ్లు పైబడిన వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు (ఫైల్)

పాలమూరు: భారీగా పెరిగిపోతున్న వాహన కాలుష్యంతో వాతావరణంలో సమతుల్యత లోపించి కొత్త రకం జబ్బులు వస్తున్నాయి. ఈ క్రమంలోనే కాలం చెల్లిన వాహనాలను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15, 20 ఏళ్ల దాటిన వాహనాలకు గ్రీన్ టాక్స్ భారీగా విధిస్తోంది. 15 ఏళ్లు దాటిన ద్విచక్రవాహనం రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోవడానికి రూ.2 వేలు, 20 ఏళ్లు దాటిన బైక్‌లకు రూ.5 వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. ఇక 15 ఏళ్లు దాటిన కార్లకు రూ.5 వేలు, 20 ఏళ్లు దాటిన వాటికి రూ.10 వేల పన్నులు వసూలు చేయాలని ఖరారు చేశారు. ఉమ్మడి జిల్లాలో చాలా వరకు కార్లు, ద్విచక్రవాహనాలు 20 ఏళ్లు పైబడినా అలాగే రోడ్లపై నడుపుతున్నారు. అలా కాలం చెల్లిన వాహనాల నుంచి భారీస్థాయిలో పొగ విడుదల కావడంతో మిగిలిన వాహనదారులు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

⇨ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక వాహనం కలిగి ఉండటం సర్వసాధారణమైపోయింది. వాహనం ఉండటం సరే.. దాని నుంచి వచ్చే కాలుష్యమే పర్యావరణానికి హాని కలిగిస్తోంది. వాహనాల నుంచి వచ్చే కార్బన్ మోనాక్సైడ్ వల్ల ఓజోన్ పొర బాగా దెబ్బతింటోంది. వాహనాల నుంచి మోతాదుకు మించి కాలుష్యం విడుదల కాకుండా ఆర్టీఏ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. డీజిల్ వాహనాల నుంచి 60 శాతానికి మించి పొగ రాకూడదు. అలాగే పెట్రోల్ వాహనాల నుంచి ద్విచక్రవాహనమైతే 3.5శాతం, కార్లు ఇతర వాహనాలైతే 4.5 శాతానికి మించరాదు. కానీ, కాలం చెల్లిన వాహనాల నుంచి అధిక మోతాదులో పొగ విడుదలవుతుంది. దేశ రాజధానిలో వాహనాల వినియోగం ఎక్కువ కావడంతో విపరీతమైన కాలుష్యం ఏర్పడుతోంది. అక్కడి ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్న నేపథ్యంలో పలు సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఒకరోజు కొన్ని వాహనాలను మాత్రమే రహదారి మీదికి అనుమతిస్తున్నారు. మన పట్టణంలోనూ రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతోంది. జిల్లాలోని పలు గుంతల రహదారులతో పాటు వాహనాల పొగతో వెలువడే కాలుష్యంతో ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు.

వాహనం	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి	గద్వాల	నారాయణపేట
జీపులు	44	14	4	9	25
కార్లు	2,742	710	614	491	593
బైక్‌లు	8,998	2,947	2,383	1,944	2,593
ఓమ్నీ బస్సులు	201	98	52	27	154
ట్రాక్టర్లు	1,023	681	424	444	861
ట్రాలీలు	829	804	541	724	905
హార్‌వెస్టర్లు	43	21	6	13	31
ఇతర వాహనాలు	85	20	35	20	28

ఆదేశాలు ఇచ్చాం..



ఉమ్మడి జిల్లాలో ఉన్న అందరూ ఎంవీఐలు, ఆర్టీఓలకు 15 ఏళ్లు పైబడిన వాహనాలకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేసి అలాంటి వాహనాలు గుర్తించి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో 15, 20 ఏళ్లు పైబడిన వాహనదారులు ప్రతిఒక్కరూ వారి వాహనాల రెన్యువల్ చేసుకోవాలి. రెన్యువన్ లేని వాహనాలు ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలో పట్టుబడితే సీజ్ చేస్తాం. ప్రధానంగా రోడ్లపై వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ సీటు బెల్ట్, హెల్మెట్ తప్పక ధరించాలి.

– కిషన్, డీటీసీ ఉమ్మడి జిల్లా

ఉమ్మడి జిల్లాలో 15ఏళ్లు పైబడిన అన్ని రకాల వాహనాల వివరాలు

జిల్లా	వాహనాలు
మహబూబ్‌నగర్	13,965
నాగర్‌కర్నూల్	5,295
వనపర్తి	4,059
జోగులాంబ గద్వాల	3,672
నారాయణపేట	5,190

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో కాన్ఫరెన్స్‌హాలులో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 21నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9:30–12:30 పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,717మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా వారికి 40 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి మాస్‌కాపీయింగ్ జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇందు కోసం 40మంది చీఫ్ సూపరింటెండెంట్స్, ముగ్గురు ఫ్లెయింగ్ స్క్వాడ్స్, నాలుగు రూట్ ఆఫీసర్లు, 40 డిపార్ట్‌మెంటల్ అధికారులు, 14 సెంటర్ కస్టోడియన్స్, 40సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసుస్టేషన్ నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాల రవాణా, పరీక్షా అనంతరం సమాధాన పత్రాల బండిల్స్‌ను పోస్టాఫీసులకు తరలింపు ప్రక్రియ కట్టుదిట్టమైన భద్రతా నడుమ చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయాలన్నారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పించాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయ, నర్సింగ్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీఈవో అబ్దుల్‌గని, డిప్యూటీ జెడ్పీ సీఈవో నాగేంద్రం, డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా చిన్నారి మృతి


దర్శిని మృతదేహం

మల్దకల్ : అనుమానాస్పదంగా ఓ చిన్నారి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని మద్దెలబండలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నందికర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పవిత్ర, నరేష్ దంపతుల 13నెలల కుమార్తె దర్శినిని ఈనెల 27న ఇంట్లోని ఉయ్యాలలో పడుకోబెట్టి తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంటి దగ్గర ఉన్న నాయనమ్మ చిన్నారికి ఆహారం అందించి నిద్రపుచ్చింది. మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంటికొచ్చిన తల్లి పవిత్ర చిన్నారిని చూడగా అచేతన స్థితిలో కనిపించింది. కుటుంబ సభ్యులు దర్శినిని చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చిన్నారి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

గోపాల్‌పేట: అప్పులు, కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని మృతిచెందిన ఘటన మండల కేంద్రంలోని హనుమాండ్లగడ్డ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ దామోదర్‌రెడ్డి కథనం మేరకు.. హనుమాండ్లగడ్డకాలనీకి చెందిన మల్లయ్య (40)కు ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్యకు ఇద్దరు కుమారులు ఉండగా.. అప్పులు, కుటుంబ కలహాలతో కొంతకాలంగా మలయ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కాసేపటి తర్వాత తమ్ముడు శివ గుర్తించి తలుపులు బద్దలుగొట్టి చూడగా అప్పటికే మృతిచెందాడు. భార్య కొంకలి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్‌ఐ వివరించారు.

నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష

దేవరకద్ర: హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రిన్సిపల్ సబ్ కోర్టు న్యాయమూర్తి గాండ్ల రాధిక తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. 2017లో ముత్యాలంపల్లిలో శ్రీనివాస్‌పై మురళీధర్‌రావు కత్తితో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పట్లో దేవరకద్ర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ కోర్టులో జరిగిన వాదోపవాదాల్లో నేరం రుజువు కావడంతో మురళీధర్‌రావుకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్లకు చెందిన మేర కృష్ణయ్య (48) చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ఉదయం తాడూరు శివారులో చోటు చేసుకుంది. అందుకు సంబంధించి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కృష్ణయ్య భార్య అంజనమ్మ, పిల్లలతో విడిపోయి 20 ఏళ్లుగా తన చెల్లెలు తాడూరుకు చెందిన సాకేవల చంద్రకళ వద్ద ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం ఎవ్వరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని బొడ్డుపల్లి చంద్రయ్య వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని విగతజీవిగా కన్పించాడు. గమనించిన పరిసర పొలాల రైతులు మృతుడి చెల్లెలికి సమాచారం అందించారు. తన అన్న తరచుగా కడుపునొప్పితో ఇబ్బందులు పడేవాడని, ఆ బాధ తట్టుకోలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అప్పులు కట్టలేక..

జడ్చర్ల: అప్పులు కట్టలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన జడ్చర్లలో చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు.. స్థానిక ఎర్రగుట్టలోని డబుల్‌బెడ్ రూం కాలనీలో నివాసం ఉంటున్న వడ్డె సంజీవ (30) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గురువారం పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం భార్య శ్రీలత తన ముగ్గురు పిల్లలను తీసుకొని తల్లి గారింటికి వెళ్లింది. తిరిగి అదే రోజు సాయంత్రం భార్య ఇంటికి వచ్చే సరికి బెడ్‌రూంలో భర్త వడ్డె సంజీవ ఫ్యాన్ కొండికి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల కుటుంబ అవసరాల నిమిత్తం సంజీవ స్థానికంగా పలువురితో డబ్బులు అప్పుగా తీసుకుని వాడుకొన్నాడు. అప్పులు తీర్చలేక మానసికంగా కుంగిపోయాడని, ఈ కారణంగానే తన భర్త ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భార్య శ్రీలత చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని యువకుడికి గాయాలు

దేవరకద్ర: మండల కేంద్రంలో శుక్రవారం రైలు ఢీకొని ఓ యువకుడు గాయపడ్డాడు. ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడా లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే విషయం తెలియాల్సి ఉంది. పేరు తెలియని యువకుడిది మహబూబ్‌నగర్ మండలం ఓబ్లాయిపల్లితండాగా తెలిసింది. కుటుంబ సభ్యులకు రైల్వే పోలీసులు సమాచారం ఇచ్చారు. గాయపడ్డ యువకుడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బీసీ కులగణన సర్వే తప్పుల తడక


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత చిత్రంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- సీఎం రాలేదని గగ్గోలు పెడుతుంటే ఉన్న మంత్రులూ వెళ్లిపోయారు
- పింక్ బుక్ మెయింటైన్ చేస్తాం.. మాకూ టైం వస్తది
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నాగర్‌కర్నూల్/ కొల్లాపూర్: ఎస్‌ఎల్‌బీసీ ఘటన జరిగి ఇన్ని రోజులవుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించలేదని ఓ పక్క అందరూ గగ్గోలు పెడుతుంటే.. ఉన్న మంత్రులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా సింగోటం లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జిల్లాకేంద్రంలో బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 8 మంది ప్రాణాలు ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో కొట్టుమిట్టాడుతుంటే ఢిల్లీ నుంచి కాంగ్రెస్ దూత వచ్చారని మంత్రులు సంఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారని తెలిపారు. ఒక్క మంత్రి కూడా సంఘటనా స్థలం వద్ద లేరంటే ప్రాణాలంటే కాంగ్రెస్ నాయకులకు లెక్కలేనితనమో అర్థమవుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన బీసీ కులగణన సర్వే అంతా తప్పుల తడకగా ఉందన్నారు. 2014లో కేసీఆర్ జరిపిన సర్వేలో 52 శాతం బీసీలు ఉంటే కాంగ్రెస్ సర్వేలో 46 శాతానికి తగ్గిందన్నారు. తప్పుడు లెక్కలతో బీసీల జనాభాను కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ చూపిస్తోందని విమర్శించారు. రెండోసారి బీసీ కులగణన చేస్తున్నామని చెప్పిన ప్రభుత్వం దీనిపై ఎక్కడా ప్రచారం నిర్వహించకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. మళ్లీ అదే సర్వే రిపోర్టును చూపించి బీసీలను మోసం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీసీలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 46 శాతం రిజర్వేషన్లు కల్పించేలా వేర్వేరు బిల్లులు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. బీఆర్‌ఎస్ శ్రేణులను ఇబ్బంది పెడుతున్న నాయకులను, అధికారులను ఎవరినీ వదిలిపెట్టమన్నారు. 'ముఖ్యమంత్రి గారు మీ మహబూబ్‌నగర్ నుంచే చెబుతున్నా.. కచ్చితంగా పింక్ బుక్ మెయింటైన్ చేస్తాం. మాకు కూడా టైం వస్తది. అప్పుడు అందరి సంగతి చెబుతాం.' అని కవిత హెచ్చరించారు.

బోనస్ పేరుతో బోగస్ హామీ..

రైతులకు సన్న వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం బోగస్ చేసిందని, రైతు భరోసా, రుణమాఫీ గ్రామాల్లో సగం మందికి కూడా రాలేదని కవిత అన్నారు. కేఎల్‌ఐ పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందించిన ఘనత కేసీఆర్‌దే అని, పాలమూరు– రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులు కేసీఆర్ హయాంలో 60 శాతానికి పైగా పూర్తయ్యాయని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం నార్లాపూర్ వద్ద పంప్‌హౌజ్‌ను కూడా ప్రారంభించిందని, ఇప్పుడున్న ప్రభుత్వం నిజంగా నీళ్లు ఇవ్వాలనుకుంటే 8 టీఎంసీల నీటిని ఎత్తిపోయడానికి వ్యవస్థ సిద్ధంగా ఉందన్నారు. గత 15 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల్లో ఒక తట్ట మట్టి కూడా ఎత్తిపోయలేదని దుయ్యబట్టారు. తక్షణమే మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బీసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు బీసీ గణనపై వెల్లడించిన అభిప్రాయాలను, సలహాలను ఆమె నోట్ చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, బైకాని శ్రీనివాస్‌యాదవ్, అభిలాష్ రావు, రఘువర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శివరాత్రి ఉత్సవాలు


రావణ వాహన సేవ నిర్వహిస్తున్న ఈఓ పురేందర్‌కుమార్ , అర్చకులు

కనులపండువగా ఆదిదంపతుల రావణ, అశ్వవాహన, పార్వేట సేవలు

అలంపూర్: అలంపూర్ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నాలుగోరోజు స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో నిత్యపూజ, హోమాలు, బలిహరణం, రుద్రహోమాలు చేశారు. అనవాయితీగా ఉదయం స్వామి, అమ్మవారికి రావణ వాహన సేవ నిర్వహించారు. అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రావణ వాహనంపై ఉంచి పూజలు చేసి హారతులిచ్చారు. ఈఓ పురేందర్‌కుమార్ సేవ ప్రారంభించి పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం అశ్వవాహన సేవ, పార్వేట సేవలు కొనసాగాయి. ఈ సందర్భంగా భక్తులు తమ ముంగిటకు వచ్చిన ఆది దంపతులకు స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

నేటితో ముగియనున్న ఉత్సవాలు..

ఫిబ్రవరి 25న ప్రారంభమైన ఉత్సవాలు శనివారంతో ముగియనున్నట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ముగింపు రోజున ఉదయం 7.30 నుంచి నిత్య పూజలు, హోమాలు, బలిహరణం, 9 గంటలకు శేషవాహనసేవ, 10 గంటలకు రుద్రహోమాలు, 11 గంటలకు పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, అవభృత స్నానం, మూకబలి, ధ్వజావరోహణం కార్యక్రమాలు జరగనున్నట్లు వివరించారు.

ఎండు మిరపకు నిప్పు పెట్టిన దుండగులు

- రూ. ఐదు లక్షల నష్టం


మంటల్లో కాలిపోతున్న ఎండు మిరుప

అయిజ: రైతులు పండించిన ఎండు మిరుప పంటకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఈ ఘటన గురువారం రాత్రి అయిజ మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. తూంకుంట గ్రామానికి చెందిన రైతు అలిపీర 2.30ఎకరాల పొలంలో మిరుప సాగుచేశాడు. సుమారు 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పండించిన మిరుపను పొలంలోనే ఎండబెట్టి రాశిగా కుప్ప పేర్చాడు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎండుమిరుప కుప్పకు నిప్పంటించారు. దీంతో సుమారు రూ. ఐదు లక్షల నష్టం వాటిల్లింది. శుక్రవారం బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ శ్రీనివాసరావు ఘటనాస్థలికి చేరుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు.

హైవేపై రోడ్డు ప్రమాదం



ఘటన స్థలంలో ప్రమాదానికి గురైన కార్లు, ప్రైవేటు బస్సు

ఒకరి దుర్మరణం..

కొత్తకోట: పెబ్బేరు సమీపంలోని రంగాపూర్ బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో 30 మందికి గాయాలైనట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. పెబ్బేరుకు చెందిన ముష్టి విష్ణు (35) భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి శుక్రవారం కారులో ఎర్రవల్లికి వెళ్లాడు. అక్కడ ఓ స్నేహితుడిని ఎక్కించుకొని తిరిగి హైదరాబాద్ బయలుదేరాడు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ ముస్లిం కుటుంబం కర్నూలు జిల్లా ఆత్మకూరులో బంధువులు మృతిచెందడంతో అక్కడికి వెళ్లి అంత్యక్రియలు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి కారులో బయలుదేరారు. రెండు కార్లు పెబ్బేరు సమీపంలోని రంగాపూర్ బైపాస్ వద్దకు రాగానే ఒకదానిని ఒకటి దాటబోయి డివైడర్‌ను ఢీకొని రహదారి అవతలికి వెళ్లాయి. ఈ ప్రమాదంలో విష్ణు అక్కడికక్కడే మృతిచెందగా కుమారుడి కాలు విరిగింది. భార్యకు తీవ్ర గాయాలుకాగా, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. మరో కారులో ఉన్న ముస్లిం కుటుంబంలో నలుగురికి తీవ్ర గాయాలు, నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో హైదరాబాద్ వనస్థలిపురం నుంచి తిరుపతి వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో బస్సులో ఉన్న 30 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులోని వారు ఆదివారం తిరుపతిలో జరిగే వివాహానికి హాజరు కావాల్సి ఉంది. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న హైవే సిబ్బంది, పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో వనపర్తి ఏరియా ఆస్పత్రికి అటు నుంచి పలువురిని మహబూబ్‌నగర్, మరికొందరిని హైదరాబాద్‌కు తరలించారు. మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించారు. ప్రమాద ఘటనతో జాతీయ రహదారిపై గంటల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్‌ఐ రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను పక్కకు తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

- కుచర్‌కల్ శివారులో ఇసుక ఫిల్టర్ ధ్వంసం
- వాగులో కిలోమీటర్ మేర కృత్రిమ ఇసుక
- తరలించేందుకు రోడ్డు వేసిన మాఫియా
- అధికారుల రాకను అడ్డుకునేందుకు రోడ్డుపై మట్టికుప్పలు


దుందుభీ వాగులో ఇసుక ఫిల్టర్‌ను ఇటాచీతో ధ్వంసం చేయిస్తున్న అధికారులు

రాజాపూర్: ఇసుక మాఫియాపై రెవెన్యూ, పోలీసు శాఖలు ఉక్కుపాదం మోపాయి. ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని కుచ్చర్‌కల్ గ్రామ శివారులో దుందుభీ వాగులో కాంక్రీట్‌తో ఏర్పాటుచేసిన ఇసుక ఫిల్టర్‌ను అధికారులు ధ్వంసం చేశారు. రాజాపూర్ పరిసర ప్రాంతాల జేసీబీలను అధికారులు పిలిచినా రాకపోవడంతో హైదరాబాద్ నుంచి ఇటాచీ తెప్పించి అక్కడున్న ఫిల్టర్ ధ్వంసం చేశారు. వాగులోకి కిలోమీటర్‌కు పైగా దూరం వరకు తయారుచేసిన కృత్రిమ ఇసుకను తయారుచేస్తారు. వీటిని తరలించేందుకు వీలుగా ఇసుక మాఫియా వాగులో రోడ్డు వేసుకున్నది. అధికారులు వస్తున్నారన్న సమాచారం అందడంతో వారి వాహనాలు రాకుండా ఉండేందుకు రోడ్డుకు అడ్డంగా పెద్దపెద్ద మట్టికుప్పలను అడ్డుగా పోశారు. అయితే అధికారులు తెచ్చిన ఇటాచీతో పెద్దపెద్ద మట్టికుప్పలను తొలగించి ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేశారు. జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, రాజాపూర్, బాలానగర్ ఎస్‌ఐలు శివానందం, లెనిన్, రాజాపూర్ తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి పర్యవేక్షణలో ఫిల్టర్‌ను ధ్వంసం చేయించారు. ఫిల్టర్లకు వాడుతున్న జనరేటర్లు, మోటార్లను సీజ్‌చేసి రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతుల్లేకుండా అక్రమంగా విద్యుత్‌ను వాడుతుండటంతో విద్యుత్ శాఖాధికారులు కరెంట్ కనెక్షన్‌ను తొలగించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతులు లేకుండానే ఇంటిని సైతం నిర్మించారు.

కఠిన చర్యలు తప్పవు



మండలంలో ఎక్కడైనా కృత్రిమంగా ఇసుకను తయారు చేస్తున్నా అక్రమంగా ఇసుకను తరలించినా కఠినచర్యలు తప్పవు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. గ్రామాల శివారుల్లోని రైతులు, గ్రామస్తులు సైతం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సమాచారం ఉంటే తమకు తెలపాలి.

– శివానందం, ఎస్‌ఐ రాజాపూర్

ఇసుక డంప్‌లను సీజ్ చేస్తున్నాం



ఇసుక రవాణా జరుగుతున్నదని తమ దృష్టికి వస్తే వెంటనే దాడులు చేసి ఇసుక డంప్‌లను సీజ్ చేస్తున్నాం. పట్టుబడిన వాహనాల స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తున్నాం. దుందుభీ వాగులో కృత్రిమ ఇసుక తయారుచేస్తున్నట్లు సమాచారం రాగానే వెళ్లి ఇసుక ఫిల్టర్‌ను ధ్వంసం చేశాం.

– విద్యాసాగర్‌రెడ్డి, తహసీల్దార్, రాజాపూర్

విద్యార్థి మృతదేహం లభ్యం

- రెండో కోనేరులో మృతదేహాన్ని గుర్తించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నిరసన


గుండాల రెండో కోనేరు నుంచి మృతదేహంను వెలికి తీస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

వెల్దండ: మండలంలోని గుండాల కోనేరులో గల్లంతైన విద్యార్థి ఓమేష్(17) మృతదేహం లభ్యమైంది. రెండో కోనేరులో శుక్రవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. ఈనెల 26న స్నేహితులతో కలిసి దైవదర్శనానికి వచ్చిన ఓమేష్ కోనేరులో గల్లంతయ్యాడు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ సహకారంతో గురువారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గుండాలకు చేరుకున్నాయి. ప్రధాన కోనేరులో విద్యార్థి కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. శుక్రవారం పక్కనే మరో కోనేరులో ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండో కృష్ణాతర్‌జీ ఆదేశాల మేరకు సిబ్బంది పృథ్వీ, మల్లికార్జున్ గాలింపు చేపట్టారు. క్రేన్ సహాయంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కోనేరులోకి వెళ్లి దాదాపుగా 120ఫీట్ల లోతులో మృతదేహం ఆచూకీ గుర్తించారు. కోనేరు లోతు ఎక్కువగా ఉండడంతో క్రేన్ సామర్థ్యం సరిపోవడం లేదు. కోనేరులో నుంచి మళ్లీ బయటికొచ్చిన సిబ్బంది అక్కడి పరిస్థితిని వివరించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మరో భారీ క్రేన్ తెచ్చి కోనేరులోకి వెళ్లి గల్లంతైన విద్యార్థి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

సహాయక చర్యలను పరిశీలించిన ఎమ్మెల్యే..

గుండాల కోనేరులో గల్లంతైన విద్యార్థి ఓమేష్‌ను గుర్తించడానికి ఎన్‌ఆర్‌ఎఫ్ బృందం, పోలీసులు, ఫైర్ సిబ్బంది చేపట్టిన సహాయక చర్యలను శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. కేంద్ర బలగాల కమాండర్ కృష్ణాతార్‌జీను వివరాలను అడిగి తెలుసుకున్నారు.నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, వెంకటయ్యగౌడ్‌తో కలసి గాలింపు చర్యలను తెలుసుకున్నారు.

లోతు తెలియకనే జాప్యం



గుండాల కోనేరులో గల్లంతైన విద్యార్థి మృతదేహం గుర్తించడంలో జాప్యానికి కారణం కోనేరు తెలియకపోవడమే. ప్రధాన కోనేరులో గురువారం వెళ్లి పరిశీలించాం. అక్కడ విద్యార్థి ఆచూకీ లభించలేదు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేశాం. శుక్రవారం ఉదయాన్నే పక్కనే ఉన్న మరో కోనేరులోకి వెళ్లి చూడగా మృతదేహం లభ్యమైంది. దాదాపుగా 120ఫీట్ల లోతులో మృతదేహం ఉండడంతో భారీక్రేన్ అవసరమైంది. మరో క్రేన్ సహాయంతో రెండో కోనేరులోకి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశాం. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కోనేరు కావడంతో పరిస్థితిని అంచనా వేయలేకపోయాం.

– పృథ్వీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యుడు


నిరసన తెలుపుతున్న బంధువులు

మృతదేహంతో నిరసన..

కోనేరులో మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో పాటు వివిధ సంఘాల నాయకులు మృతదేహంతో మూడు గంటలపాటు నిరసన తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.కోటి ఇవ్వాలని, ఒకరికి ఉద్యోగం, మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ యాదగిరి సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎంతకీ వారు వినకపోవడంతో ఎమ్మెల్యే కసిరెడ్డితో ఫోన్ ద్వారా బాధిత కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇప్పించినట్లు సమాచారం. తక్షణసాయం కింద రూ.60వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణం

- ఇటీవల అనారోగ్యంతో భార్య మృతి
- అనాథలైన ముగ్గురు చిన్నారులు


అనాథలైన చిన్నారులు


వీరేష్(ఫైల్)

మల్దకల్ : నెల రోజుల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో తల్లిదండ్రులను కోల్పోయి ముగ్గురు చిన్నారులు అనాథలుగా మారిన ఘటన శుక్రవారం చర్లగార్లపాడులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నందికర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కుమ్మరి వీరేష్(32) భార్య భారతి జనవరిలో అనారోగ్యంతో మృతి చెందింది. ఆర్థిక సమస్యలతో మనస్తాపం చెందిన వీరేష్ గురువారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రించిన అనంతరం ఇంట్లో పొలాలకు పిచికారీ చేసే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో ఉండగా వీరేష్‌ను చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. నెల రోజుల వ్యవధిలోనే తల్లి అనారోగ్యంతో, తండ్రి ఆత్మహత్య చేసుకోవడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

అమరచింత: అక్రమంగా తరలిస్తున్న 5 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. పట్టణంలోని శ్రీకృష్ణానగర్‌లో గల కాళికాలయం సమీపంలో అక్రమంగా ఓ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం రేషన్ బియ్యం కలిగిన వాహనంను అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టణానికి చెందిన సాకలి కోరి కృష్ణ అనే వ్యక్తి కొన్నేళ్లుగా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడన్నారు. ఇదే తరహాలో ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని డంప్ చేసి వాహనంలో తరలిస్తూ పట్టుబడినట్లు వెల్లడించారు. వాహనంలోని 101 బియ్యం బస్తాలను సీజ్ చేసి డీఎస్‌ఓకు సమాచారం అందించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని తెలిపారు.

వసతి గృహంలో అన్నం వండలేదని నిరూపిస్తే రాజీనామా చేస్తా

మాజీ మంత్రి కేటీఆర్‌కు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సవాల్


కొండనాగులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కొండనాగుల ఎస్టీ బాలుర వసతి గృహంలో శివరాత్రి రోజు అన్నం వండలేదని నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా.. నిరూపించకపోతే నీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తావా.. అని మాజీమంత్రి కేటీఆర్‌కు అచ్చంపేట ఎమ్మెలే వంశీకృష్ణ సవాల్ విసిరారు. బల్మూరు మండలంలోని కొండనాగుల ఎస్టీ బాలుర వసతి గృహంలో శివరాత్రి రోజు విద్యార్థులకు అన్నం వండకుండా పస్తులుంచారని మాజీమంత్రి కేటీఆర్ మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఎస్టీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వసతి గృహాల వైపు చూడకుండా పేద విద్యార్థులను పట్టించుకోని కేటీఆర్ ఇక్కడి నుంచి ఎవరో ఇచ్చిన తప్పుడు సమాచారం ఆధారంగా ట్విట్టర్(ఎక్స్)లో మాట్లాడటం వారి రేటింగ్‌లకేనని విమర్శించారు. ఇక్కడికి వచ్చి వాస్తవాలను తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల పాఠశాలలను మూసివేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వసతి గృహాల్లో మెనూ పెంచి నాణ్యమైన భోజనం, విద్య అందిస్తున్నారని, దీనిని బీఆర్‌ఎస్ జీర్ణించుకోలేకపోతోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికే తప్పుడు సమాచారంతో దిగజారుడు ప్రకటనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.